

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం 20 మార్చి, 2025 — 8 పేజీలు

రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి:కలెక్టర్

విశాలాంధ్ర-గాలివీడు: రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చెయ్యాలని అన్నమయ్య కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు.బుధవారం గాలివీడు మండలం పందికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని బత్తినవాండ్లపల్లెలో సర్వే నంబర్ 106 లో రైతు బి.ఇరగం రెడ్డి, బి.వెంకటరమణారెడ్డికి చెందిన 75 సెంట్ల భూమిలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎన్నివేల ఎకరాలు ఉన్నాయి,అందులో డ్రైలాండ్, వెట్ ల్యాండ్ విస్తీర్ణం ఎంత, రీసర్వే ఎప్పుడు మొదలు పెట్టారు,ఎన్ని టీములు సర్వే చేస్తున్నాయి,ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో రీసర్వే చేశారు, ఇంకెంత చెయ్యాలి తదితర వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.సదరు గ్రామంలో రీసర్వే చెయ్యాల్సిన భూములు,పూర్తి చేసిన వివరాలు తాసీల్దార్ భాగ్యలత వివరించారు.రీసర్వే ప్రక్రియలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.ప్రభుత్వ భూములు,పట్టా భూములు,తదితరాలను పక్కాగా సర్వే చెయ్యాలని చెప్పారు.ఏరోజుకారోజు వెక్టరైజేషన్ పూర్తి చెయ్యాలని సూచించారు.ఈసందర్భంగా అక్కడి రైతులతో సర్వే ప్రక్రియపై ముఖాముఖి మాట్లాడారు.వారికున్న విస్తీర్ణం,సర్వే చేసిన కొలతలు సరిపోతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో తాసీల్దార్ భాగ్యలత, ఆర్.ఐ బాలజీ, మండల సర్వేయర్ మురళీ,తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం దొంగల అరెస్టు

వివరాలు వెల్లడించిన సీఐ నరేష్‌బాబు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక వేంపల్లె రోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగలను ఎర్రగుంట్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ నరేష్‌బాబు వెల్లడించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం (ఈనెల 17వ తేదీ) మధ్యాహ్నం సుమారు 2గంటల సమయంలో గ్యాస్ సిలిండర్, కట్టర్ యంత్రంతో ఏటీఎంలో దోపిడీకి విఫలయత్నం జరిగిందని ఈ ప్రయత్నంలో ఏటీఎం క్యాష్ బాక్సు మెయిన్ డోర్ తెరుచుకోలేదని వివరించారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు

2

అప్పు పట్టు.. ఐపి పెట్టు!

విశాలాంధ్ర - ఖాజీపేట: ఐపీ పేరు వింటేనే ఖాజీపేట మండల వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఐపీ అంటే ఇన్సాల్వెన్సీ పిటిషన్. వ్యాపారంలో నష్టాలు వచ్చినపుడు రుణ గ్రహీతలను రక్షించడానికి తయారు చేసిన చట్టమిది. నష్టాల బారిన పడిన వ్యకి తాను దివాళా తీసినట్టు ప్రకటించమని కోర్టును ఆశ్రయించి, తనకున్న అప్పులు, ఆస్తుల జాబితాను సమర్పించి, నష్టాలకు కారణాలను వివరించి కోర్టు నుంచి రక్షణ పొందే వెసులుబాటు ఈ చట్టం కల్పిస్తోంది. అయితే, ఈ రక్షణ ప్రస్తుతం మోసగాళ్లకు వరంగా మారింది. ఐపీని అస్త్రంగా చేసుకుని 'కొందరు' నమ్మిన వారికి టోపీ పెడుతున్నారు. అయితే, ఈ చట్టం అప్పులు తీసుకున్న వారికే కాదు, ఇచ్చిన వారికి సైతం రక్షణ కల్పిస్తుంది. రుణ గ్రహీత నుంచి తమకు రావాల్సిన రొక్కం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నప్పుడు కోర్టును ఆశ్రయించి సదరు వ్యక్తిని దివాళాకోరుగా ప్రకటించమనే అవకాశం చట్టం కల్పిస్తోంది. దివాలా పిటిషన్ దాఖలా చేసిన వ్యక్తి ఆస్తులను, అప్పులను ఇతర సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం కోర్టు సదరు వ్యక్తి దివాళా తీసినటు ప్రకటిస్తుంది. అయితే, దివాళా పిటిషన్లు దాఖలవుతున్నప్పటికీ ,కోర్టు విచారణ పూర్తయి దివాలా తీసినట్టు ప్రకటించిన కేసులు చాలా తక్కువ.

ఎందుకు పెడుతున్నారు..?

చిట్టీలు, ఫైనాన్స్ రూపంలో రూ.కోట్లు వసూలు చేస్తున్న వ్యాపారులు కొందరు ఇష్టారీతిన డబ్బును సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. మరికొందరు 'రియల్' వ్యాపారంలో పెట్టి బురిడీ కొడుతుంటే, ఇంకొందరేమో ఆస్తులను కూడబెట్టుకొంటున్నారు. ఇంకొందరు అధిక వడ్డీలు చెల్లించడం ద్వారా నష్టపోతున్నారు. అయితే, నష్టాలను కప్పిపెడుతూ నమ్మిన వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుకుంటున్నారు. చివరకు ఆస్తులను ఇతరుల పేరిట మార్చడం, అమ్ముకోవడం ద్వారా వచ్చిన సొమ్మును దాచుకుని ఐపీ బాట పడుతున్నారు. అయితే, ఈ పిటిషన్లు దాఖలయినప్పుడు కోర్టుకు వచ్చి న్యాయ పోరాటం చేసే వ్యాపారులు తక్కువగా ఉండడంతో వంచకుల ఆటలు సాగుతున్నాయి. కొందరు నమ్మిన వారికి టోపీ పెట్టడానికి ముందస్తు ప్రణాళికతో ఐపీ ఎత్తుగడలు వేస్తున్నారు. అయితే, బడా వ్యాపారులు ఐపీ జాబితాలో ఉన్నప్పుడు వారి వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా లోలోపల సెటిల్మెంట్లు చేసుకుని, చిన్న పెట్టుబడిదారులను నిండా ముంచుతున్నారు.అధిక వడ్డీ ఆశ చూపడం విచ్చల విడిగా అప్పులు చేయడం.. అధిక వడ్డీ పేరుతో జనం నుంచి డబ్బులు వసూలు చేయడం..ఇలా సేకరించిన సొమ్ముతో ఆస్తుల కొనుగోలు, వ్యాపారాలు చేయడం. అదను చూసి 'ఐపీ' పెట్టేసి భాగస్వాములు, ప్రజల నెత్తిన టోపీ పెట్టేయడం.. ఇలాంటి ఘటనలు గతంలో నుంచి ఈ మధ్యకాలం వరకు ఖాజీపేట లో తరచూ వెలుగు చూస్తునే ఉన్నాయి. రాజ్యాంగం కల్పించిన 'రక్షణ' కొందరికి ఆయుధంగా మారింది. భాగస్వాములు, జనాల నమ్మకమే పెట్టుబడిగా భారీగా కూడబెట్టుకొని, ఆ తర్వాత దివాళా తీశామని కోర్టు తలుపు తట్టడం షరా మామూలుగానే మారింది.

ఐపీ.. ఈ పదం ప్రస్తుతం ఖాజీపేట ప్రజల్లోనూ వ్యాపారవర్గాల్లోనూ ఇప్పుడు వణుకు పుడుతోంది. చిట్టీలు వేసిన వారి గుండెల్లో దడ పుట్టిస్తోంది. చిన్నా చితకా పొదుపు చేసిన సొమ్మును ఫైనాన్స్ లో చిట్టీలు, పెట్టుబడుల రూపంలో పెట్టిన వారిలో కలకలం రేపుతోంది. దివాళా పేరిట టోకరా వేస్తుండడంతో తీవ్ర ఖాజీపేట వాసుల్లో అయోమయం, గందరగోళం నెలకొంది. ఈ మధ్యకాలంలో కొందరు ఐపీ బాట పట్టి, నమ్మిన వారికి సుమారు రూ. కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టారు. ఇటీవల ఖాజీపేట మండలం రూరల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి కొంతమందికి మాయమాటలు చెప్పి దాదాపు రూ.1.80 కోట్లకు పైగా అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. ఏళ్లు గడుస్తున్నా తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో బాధితులు అతడిని ఒత్తిడికి గురి చేశారు. దీంతో కుటుంబ సభ్యులను తీసుకుని వ్యాపారి పరారీ అయినట్లు సమాచారం. వైశ్యులకు సంబంధించిన మరో వ్యక్తి కూడా దాదాపు 8 కోట్ల రూపాయలకు పైగా ఐపీ పెట్టినట్లు రాబడిన సమాచారం. మంచి వ్యక్తిగా గుర్తింపు పొందినందుకే అప్పులు ఇచ్చామని, మోసం చేస్తాడని అనుకోలేదని బాధితులు వాపోయారు. ఈ ఐపీ తంతంగం కోట్ల రూపాయలకు మాత్రమే పరిమిత మనుకుంటే పొరపాటే మండలోనే మరో గ్రామానికి సంబంధించిన వ్యక్తి సైతం పది నుంచి 20 లక్షల వరకు ఐపీ పెట్టి జారుకున్నట్లు తెలిసింది. నమ్మకంగా ఉంటూనే చివరికి ఇలా చేస్తారని ఊహించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు అంతా కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఏటీఎం దొంగల అరెస్టు

(మొదటి పేజి తరువాయి) నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక బైపాస్ రోడ్డు వైజంక్షన్ వద్ద రాజుపాలెం మండలం తొండలదిన్నె గ్రామానికి చెందిన కొత్తమాసి సుధీకర్‌తో పాటు ఇతనికి సహకరించిన వెల్డర్ గాలిపోతుల అభిషేక్‌లను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. కొత్తమాసి సుధీకర్ 2020 సంవత్సరం నుండి సెక్యూర్ వాల్యు కంపెనీ ద్వారా ఏటీఎంలకు డబ్బులు లోడ్ చేస్తు ఉండేవారని, పేకాట, ఇతర వ్యసనాలకు బానిసైన సుధీకర్ ఏటీఎంలలో నగదు లోడు చేసే క్రమంలో సుమారు రూ.35లక్షలు తస్కరించినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఈ మొత్తాన్ని సుధీకర్ ఉద్యోగంలో చేరే సమయంలో షూరిటీ ఇచ్చిన వ్యక్తుల నుండి విడతల వారీగా సదరు కంపెనీ వసూలు చేసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. ఏటీఎంలలో నగదు లోడు చేసే అనుభవం ఉన్న సుధీకర్ గాలిపోతుల అభిషేక్‌తో కలిసి ఇక్కడి వేంపల్లె రోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు సీఐ వివరించారు. ప్రజలు అసాంఘీక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లయితే వారి పేర్లు గోప్యంగా ఉంచడంతో పాటు వాటి కట్టడికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తద్వారా దొంగతనాలకు ఆస్కారం ఉండబోదని సీఐ గుర్తుచేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని ఆయన సూచించారు. వీరి వద్దనుండి ఒక కారు, గ్యాస్ ఆక్సిజన్ సిలెండర్లు, గ్యాస్ కట్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వెలిపారు.

ఘనంగా మంత్రి సోదరుల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అతని సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు లక్కిరెడ్డిపల్లి మండల స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పండుగలా అంగరంగ వైభవంగా మండల టిడిపి ఇంచార్జ్ యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి సోదరులు జన్మదిన వేడుకలకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి మండిపల్లి అభిమానులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొని మంత్రి అతని సోదరుడు రామ్ లక్ష్మణులు జన్మదిన వేడుకలను భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి స్థానిక టిడిపి కార్యాలయం నందు మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాయచోటి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో యువత, టిడిపి నాయకులు మండిపల్లె అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లి మండల యువ నాయకుడు యనమల మదనమోహన్ మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రజల కొరకు ప్రజా సంక్షేమం కొరకు నియోజకవర్గ అభివృద్ధి కొరకు ఎల్లవేళలా కష్టపడుతున్నటువంటి మన ప్రియతమ నాయకుడు ఆరాధ్య దైవంగా భావించే రామ్ లక్ష్మణులు అయినటువంటి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అతని సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఇలాంటి జన్మదినం వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఎల్లవేళలా దేవుడినటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి దీవెనలు అందాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని తెలియజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులతో పాటు లక్కిరెడ్డిపల్లి మండల తెలుగుదేశం నాయకులు రాయచోటి గవర్నమెంట్ హాస్పిటల్ సుపరిండెంట్ మహేశ్వర్ రాజు, మాజీ ఏపీఐసీసీ చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకట్రామ రాజు, కాంట్రాక్టర్ యాగంటి పాపయ్య, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, షేక్ ఆర్తీఫుల్లా, జయరాం, రామాంజనేయులు, దేవేంద్రా రెడ్డి, సిద్దక వెంకట్రామ రెడ్డి, యాగంటి సుధీర్, నస్రుద్దీన్, పక్కీరయ్య, మల్లి, రవిశంకర్ రాయల్, ఆర్కే హేమంత్, శంకర్, డీలర్ అన్వర్, సయ్యద్ మసూద్,ముక్తార అహ్మద్, ఓబులేసు, మూగి వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

గెట్ ఎగ్జామ్‌లో ఖాజీపేట విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర - ఖాజీపేట: ఖాజీపేట మండల పరిధిలోని పత్తూరు గ్రామ పంచాయితీ డాయన్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన జాదవ్ చిన్న పీరయ్య కుమారుడు. జాదవ్ శ్రావణ్ కుమార్ 2025 గెట్ ఎంట్రన్స్ నందు గ్రూప్ విభాగములో ఆల్ ఇండియా ర్యాంక్ 250 సాధించాడు. శ్రావణ్ సాధించిన విజయానికి కుటుంబ సభ్యులు స్నేహితులు గ్రామస్తులు హర్ష వెలిబుచ్చారు.

పేదోడి ఫ్రిజ్‌లు - మట్టి బానలు

విశాలాంధ్ర-పులివెందుల: వేసవి వచ్చిందంటే చాలు మట్టి బానలు దర్శనమిస్తాయి. వేసవికాలం పూర్తి అయ్యేవరకుమట్టి మట్టిపాత్రలకు గిరాకీ కూడా ఉంటుంది. ఒక సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే ఈ మట్టి పాత్రలు తయారు చేస్తారు. సీజన్ పరంగా వారికి కాస్త ఉపాధి కూడా లభిస్తుంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని మడూరు, ముత్తుకూరు, గొల్లల గూడూరు మరి కొన్ని గ్రామాలలో వీటిని ప్రత్యేకించి తయారు చేస్తారు. కడవలు, బానలు, మూకట్లు, ముంతలు, కూజాలు మరి కొన్నిటిని తయారు చేయడంలో వారు దిట్ట. కాలక్రమేనా కాల గమనంలో మట్టి పాత్రలు అంతరించిపోయాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో మట్టి పాత్రలను వినియోగించేవారు కరువయ్యారు. అల్యూమినియం తో తయారు చేసే పాత్రలు మార్కెట్లోకి వచ్చిన తరువాత మట్టి పాత్రలకు గిరాకీ తగ్గింది. మట్టి పాత్రలు అంటే మట్టితో చేయబడిన వంట పాత్రలు, పాత్రలు, ఇతర వస్తువులు. ఇవి చాలా పాతకాలం నుండి వాడుకలో ఉన్నాయి, ఇవి సులభంగా లభించేవి, చౌకైనవి పర్యావరణానికి అనుకూలమైనవి. మట్టి పాత్రలలో వండిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, మట్టిలో ఉండే ఖనిజాలు ఆహారంలోకి వెళ్ళడం మంచిదని కొందరు నమ్ముతారు. మట్టి పాత్రలలో ఆహారాన్ని నిల్వ చేయవచ్చు. ఎందుకంటే అవి వేడిని నిల్వ చేయవు ఆహారాన్ని తాజాగా ఉంచుతాయి. మట్టి పాత్రలు మన సంస్కృతిలో ఒక భాగం, చాలా కాలం నుండి వాడుకలో ఉన్నాయి. మట్టి పాత్రలు వంట కోసం, ఆహారాన్ని నిల్వ చేయడానికి, గృహాలంకరణ కోసం కూడా ఉపయోగించ వచ్చు. సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోవడంతో మట్టిపాత్రల వినియోగం చాలా వరకు తగ్గింది. ప్రస్తుత కాల పరిస్థితుల్లో మార్కెట్‌లో వివిధ రకాల సామాగ్రి (రెడీమేడ్)అందుబాటులోకి రావడంతో వీటి గిరాకీ తగ్గిందనే వాదన వినవస్తోంది. దీంతో వీటిని తయారు చేసి జీవనం సాగిస్తున్న ఎంతో మంది శాలివాహనులు నిరాశ్రయులయ్యారు. విధిలేని పరిస్థితుల్లో తరతరాల నుంచి వస్తున్న కులవృత్తికి స్వస్తి పలికి బతుకుదెరువు కోసం ఇతర మార్గాలను ఎంపిక చేసుకోవాల్సి వచ్చింది. ప్రాచీనకాలం నుంచి మట్టిపాత్రలకు విశేష ఆదరణ ఉంది. ముఖ్యంగా వేసవిలో తాగునీటి కోసం మట్టిపాత్రలనే వినియోగించేవారు. ముఖ్యంగా దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలకు కూడా మట్టిపాత్రలను ఉపయోగిస్తారు. గతంలో బాటసారుల దాహార్తి కోసం గ్రామశివార్లలో చెట్టుకు బానలను ఏర్పాటు చేస్తారు. మట్టిపాత్రలలో నీటిని సేవించడం ద్వారా ఆరోగ్యానికి దోహదపడతాయని చెప్పవచ్చు. అంతేకాదు పూర్వపు రోజుల నుంచి శుభ, అశుభ కార్యక్రమాలకు కూడా ఉపయోగిస్తారు. ఎన్నో ప్రయోజనాలు ఉన్న మట్టి పాత్రలు కళ్ళముందే కనుమరుగైపోవడం మన దురదృష్టం. గతంలో వేసవి సమయంలో చలివేంద్రాలకు మట్టి బాన లనే ఉపయోగించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు ఏదో పది శాతం మినహా వీటి స్థానంలో క్యాన్లను వినియోగిస్తున్నారు. ఏది ఏమైనా మట్టి పాత్రలను వినియోగిద్దాం వాటిని ఉపయోగించాలని ఆశిద్దాం.

కులవివక్ష ప్రదర్శిస్తున్న తహసీల్దార్

విశాలాంధ్ర- పీలేరు :-ఎస్సీ వర్గీకరణ జరగకముందే మాలల పట్ల పీలేరు మండల ఎమ్మార్వో యం.భీమేశ్వర్ రావ్ కులవివక్ష ప్రదర్శిస్తున్నారని నేడు మాలమహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆగ్రహించారు . ఈ నెల 3వ తేదిన పీలేరు పట్టణానికి చెందిన మాల సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తి తాను నివసిస్తున్న ఇంటికి అనుభవ స్థితిపత్రం కొరకు అర్జీ సమర్పించారు అర్జీ ఇచ్చిన రోజు నుండి అర్జీదారులు ఇబ్రహీం,సుధాకర్, రెడ్డి శేఖర్, కళ్యాణి, వీఆర్వోల చుట్టూ మరియు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఈరోజు రేపు అంటూ వీఆర్వోలు కాలయాపన చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 11 న చరవాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన అర్జీదారులు ఇంటిని సందర్శించి ఎమ్మార్వో కు నివేదిక సమర్పించారు అర్జీ దారునితో కలిసి మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఎమ్మార్వోను కలసి అర్జీదారుని అనుభవ స్థితిపత్రం స్థితిగతుల గురించి వివరణ కోరగా ఎమ్మార్వో ఓ బాధ్యతయుత ప్రభుత్వ అధికారిగా స్పందించకుండా ఓ రాజకీయ నేతగా దర్పం ప్రదర్శిస్తూ కార్యాలయం తన జాగీరు లాగా వ్యవహరిస్తూ అర్జీ దారిని పట్ల మాలమహానాడు నాయకుల పట్ల బాధ్యతరాహిత్యంగా, దూకుడుగా వ్యవహరిస్తూ మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు వెళ్ళండి వెళ్ళండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తూ ఒక మాల సామాజిక వర్గానికి చెందిన నాయకుని పట్ల అర్జీదారుల పట్ల కనీస గౌరవ మర్యాదలు లేకుండా తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ ఎదుటివారి ఆత్మ అభిమానం కించపరిచేలా వ్యవహరిస్తున్న తహసీల్దార్ తీరు విచారించదగ్గ విషయమని నాయకుల పరిస్థితి ఇలా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఇంకెలా ఉంటుందని ఆవేదన చెందారు మునుముందు ఎమ్మార్వో వ్యవహార శైలి ఇలాగే కొనసాగితే మాలమహానాడు ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో మామహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున,మండల కార్యవర్గ సభ్యులు కొప్పల వినయ్ కుమార్, వై కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో నవీన్ తేజకు చికిత్స

విశాలాంధ్ర-రాయచోటి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు నందలూరు మండలానికి చెందిన హరి ప్రసాద్ స్వర్ణలత దంపతుల కుమారుడు నవీన్ తేజ (14)కు నగదు రహిత చికిత్స అందింది. బుధవారం ఒక పత్రికలో వచ్చిన కథనం ప్రకారం నందలూరు మండలానికి చెందిన హరిప్రసాద్ స్వర్ణలత దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు నవీన్ తేజ పుట్టిన కొద్ది రోజులకే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వివిధ ఆసుపత్రులలో వైద్యులతో పరీక్షించగా గుండెలో రంధ్రం ఉందని శస్త్ర చికిత్స చేయాలని సూచించారని, ప్రస్తుతం తమ కుమారుడి మందులకు నెలకు 6000 రూపాయల వరకు ఖర్చు అవుతుందని తమ ఆర్థిక స్తోమత మందులు కొనడానికి సైతం కష్టంగా ఉందని తల్లిదండ్రులు తమ కష్టాన్ని తెలుపుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బెంగుళూరులోని వైదేహి హాస్పిటల్ లో నవీన్ తేజకు ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం కింద, నగదు రహిత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ లోకవర్ధన్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా నవీన్ తేజ తల్లిదండ్రులు స్పందిస్తూ కూటమి ప్రభుత్వానికి మరియు జిల్లా కలెక్టర్ గారికి ఎంతో రుణపడి ఉంటామన్నారు.

జిల్లా పేరులో కడప చేర్చుతూ

వైఎస్ఆర్ పేరు కొనసాగించడం ఆనందకరం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మన జిల్లా పేరులో కడప అనే పదాన్ని పునరుద్ధరించి వైఎస్ఆర్ పేరు కొనసాగిస్తూ జిల్లా పేరును "వైఎస్సార్ కడప" జిల్లాగా మార్పు చేయాలని నిర్ణయం తీసుకోవడం ఆనందకరమని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ, శివోహం అన్న ప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప అంటే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి తొలి గడప అని మనందరికి తెలుసని, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కడపని జిల్లా పేరులో పునరుద్ధరణ చేయడంతో పాటు కడప జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును రాజకీయాలకతీతంగా కొనసాగించడాన్ని స్వాగతిస్తున్నామని వివరించారు. ఈ విశయంలో ఆయన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన కడప పేరుకు ఉన్న విశిష్ఠతను, చారిత్రక నేపథ్యంని సంరక్షించాలని కోరారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

విశాలాంధ్ర-మదనపల్లె: భార్య హత్య కేసులో భర్త కుమార్(24)ను అరెస్ట్ చేసినట్లు మదనపల్లి డిఎస్పి కొండయ్య నాయుడు తెలిపారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం, బెలగాం జిల్లా, బాటకుర్తి తండాకు చెందిన సంగీత(25), అదే తండాకు చెందిన కుమార్ ఇద్దరూ ఒకే ఊరిలో ఉంటూ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఈ క్రమంలో పెద్దలకు తెలియకుండా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదని ఇద్దరు లేచిపోయి ఏడాదిన్నర క్రితం గుర్రంకొండ మండలంలోని మర్రిపాడుకు వచ్చి ఓ రైస్ మిల్లులో కూలి పనులు చేసుకుంటూ స్థిరపడ్డారు. ఈ క్రమంలో కుమార్ మధ్యానికి బానిసై తరచూ కొట్టి పిల్లల పుట్టలేదని వేధించేవాడు. దీంతో గత నెల 28 శివరాత్రి సంగీతను కుమార్ పథకం ప్రకారం హత్య చేశాడు. ఆపై తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులను నమ్మించి మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేట్ అంబులెన్స్ లలో బెలగాంలోని బాటకుర్తి తండాకు తీసుకెళ్లాడు. అక్కడ సంగీత మృతదేహాన్ని కాల్చివేసి మిన్న కూడిపోయాడు. మర్రిపాడు గ్రామస్తుల సాయంతో హత్య జరిగినట్లు నిర్ధారించిన గుర్రంకొండ ఎస్సై మధు రామ చంద్రుడు, వాల్మీకిపురం సిఐ ప్రసాద్ బాబు హత్య కేసును లోతుగా దర్యాప్తు చేపట్టి నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించదంతో అరెస్టు చేసినట్లు డిఎస్పి తెలిపారు.

ఒంటిమిట్టను పర్యాటక హబ్ ప్రకటించడంపై హర్షం

విశాలాంధ్ర- ఒంటిమిట్ట: కేంద్ర ప్రభుత్వ ప్రసాద ప్రోగ్రాం కింద అలాగే రాష్ట్ర ప్రభుత్వ టెంపుల్ టూరిజం కింద ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని రాష్ట్రంలో ఒక పర్యాటక హబ్ గా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించడం హర్షనీయమని రాష్ట్ర మాజీ డైరెక్టర్లు మోదుగుల పెంచలయ్య కొమర వెంకట నరసయ్య ఈరోజు హరిత హోటల్ లో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2015లో 34 కోట్ల రూపాయల వ్యయంతో మాణిశ్రీ చంద్రబాబు నాయుడు గారు ఒక టీఎంసీ కెపాసిటీ కలిగిన ఒంటిమిట్ట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపట్టడం జరిగింది. 2015 నుంచి 19 వరకు టిడిపి హయాంలో ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్ వాటర్ నుంచి నీరు నింపడం జరిగింది. కాగా 2019 నుంచి 24 వరకు ఉన్న వైఎస్సార్సీపీ ప్రభుత్వ పెద్దలు కడప జిల్లా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒంటిమిట్ట చెరువుకు నీరు నింపేందుకు అవసరమైన మెయింటెనెన్స్ నిధులు కూడా మంజూరు చేయించ లేకపోవడంతో ఒంటిమిట్ట చెరువు ఎత్తిపోతల పథకం మూలన పడింది. గడచిన పది సంవత్సరాలుగా జిల్లా కేంద్రంలో అధికారులుగా ఉంటున్న ఇరిగేషన్ శాఖ ఉన్నత అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువు ఎండిపోయింది. 1989 లో బండారు రత్నసాభాపతి హయాము నుండి పసుపులేటి బ్రహ్మయ్య హయాము వర్కు ఒంటిమిట్ట చెరువుకు నిధులు కేటాయించాలని పలుమార్లు టిడిపి నేత చంద్రబాబు గారికి పదేపదే వినతి వివరాలు సమర్పించిన కారణంగా 2015లో శ్రీ చంద్రబాబు గారు 35 కోట్ల రూపాయలు కేటాయించి శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించడం జరిగింది. ఒంటిమిట్ట పర్యాటక హబ్ గా తీర్చిదిద్దాలంటే ఒంటిమిట్ట చెరువులో నిండుగా నీరు ఉంటే ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండటమే కాకుండా పర్యాటక కేంద్రంగా బోటింగ్ ఏర్పాటు చేస్తే అవకాశం ఉంటుంది. శ్రీరామ ఎత్త పోతల పథకం పంపు హౌస్ పంపు ప్రారంభం నుండి కోట పాడు కనుమ వరకు పదే పదే పైప్ లైన్ నీటి ఒత్తిడి కారణంగా పగిలిపోతున్నందున దీన్ని నివారణకు గాను 11 కోట్ల రూపాయల వ్యయంతో మూడు కిలోమీటర్ల మేర ఇనుప పైపులై నిర్మాణం చేపడితే ఒంటిమిట్ట చెరువుకు రెండు నెలల్లో నీరు నింపవచ్చని ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే నివేదికలు పంపియున్నారు. ఈ నివేదికను రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు శ్రీ మడ్డిపల్లి రాంప్రసాద్ రెడ్డి ద్వారా రాష్ట్ర ఎడ్యుకేషన్ శాఖ మంత్రివర్యులకి ఇప్పటికే అందించడం జరిగిందని వారు అన్నారు. తక్షణం 11 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తే ఒంటిమిట్ట చెరువు లో జలకల సంతరించుకుంటుంది యాత్రికులు సందడి పెరుగుతుందని వారన్నారు. అలాగే ఇక్కడ 100 పడకల గలిగిన రెండు యాత్రికుల వసతి భవనాలు వెంటనే నిర్మిస్తే యాత్రికులు ఆకర్షితులు అవుతారని ఈ ప్రాంతం పర్యాటక హబుగా తయారవుతుందని వారు తెలిపారు. కందుల దుర్గేష్ గారు చేసిన ప్రకటన పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుందని వారు తెలిపారు. తన హయాంలో ప్రారంభించిన ఒంటిమిట్ట చెరువు ఎత్తిపోతల పథకం మూలన పడిందని విషయాన్ని అధికారుల ద్వారా ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు నివేదిక తెప్పించుకొని వెంటనే 11 కోట్ల రూపాయలు మంజూరు చేయించి ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్ గా తీర్చిదిద్దాలని రాజంపేట నియోజవర్గ తెలుగుదేశం పార్టీ పక్షాన అలాగే ఒంటిమిట్ట మండల ప్రజల పక్షాన సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ పార్టీ కార్యనిర్వ కార్యదర్శి మోదుగుల నరసింహులు రాజంపేట నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు మునగపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం

ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అద్వర్యంలో నూతనంగా తీసుకొచ్చిన శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం అని కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ముక్కావారిపల్లి లోని తమ కార్యాలయం వద్ద పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బాలికల, మహిళల భద్రత కోసం శక్తి యాప్ ను నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు.ప్రతి బాలిక, మహిళలు, గృహిణులు, విద్యార్థిని లు వారి మొబైల్ లో శక్తి యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి నుండి తక్షణ సహాయం పొందాలని సూచించారు.ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే మహిళలు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర లో ఉన్న పోలీస్ స్టేషన్ కు డయల్ 112 నెంబర్ కు చేరుతుంది తక్షణం పోలీసులు స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని రక్షణ కల్పించే విధంగా కృషి చేస్తారన్నారు.గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని వ్యక్తి గత వివరాలు నమోదు చేసి ఓటిపి తో ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.ఈ శక్తి యాప్ పై పోలీసులు కూడా మహిళలలో చైతన్యం తీసుకువస్తున్నారన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల మల్లిఖార్జున రెడ్డి, పిఎస్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ పథకంను

సద్వినియోగం చేసుకోవాలి:ఎంపీడీవో

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఆదరణ త్రి పథకం ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ఎంపిడిఓ సయ్యద్ ఉన్నిషా తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సభ భవనంలో బీసీ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ఆదరణ త్రీ పథకంనకు సంబంధించి బీసీ కులముల కులవృత్తులు/ చేతివృత్తులకు సంబంధించిన సంఘ నాయకుల వారికి వారి వృత్తికి అవసరమైన పనిముట్లపై అవగాహన ఏర్పాటు చేశామన్నారు. బీసీ కులములకు చెందిన కులవృత్తులు/ చేతివృత్తులు ఆధునిక పనిముట్ల కొరకు వృత్తుల వారిగా పేర్లు ఇవ్వాలని కోరారు.

ప్రపంచం గర్విస్తున్న

భారత సంతతికి చెందిన సునీత విలియమ్స్

- అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి: భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీత విలియమ్స్ ను ప్రపంచం గర్విస్తోందని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. 8 రోజుల్లో పూర్తి కావాల్సిన ప్రయాణం ఒక సాంకేతిక సమస్య కారణంగా 9 నెలలు అంతరిక్షంలో వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ లు ఉండిపోయారన్నారు. అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన మహిళా వ్యోమగామిగా ఆమె రికార్డు సాధించారన్నారు. ఈవిజయంతో సునీతా విలియమ్స్ పేరు అంతరిక్ష పరిశోధన చరిత్రలో నిలిచిపోనుందన్నారు. భవిష్యత్తులో సునీతా విలియమ్స్ మరిన్ని ఘనతలు సాధించాలని ఆర్.రమేష్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు.

అగ్రికల్చర్ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - బద్వేలు : గోపవరం మండలం రాచాయిపేట రైతు సేవ కేంద్రంలో మండలంలో పని చేయుచున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, గ్రామ వ్యవసాయ సహాయకులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ప్రస్తుతం ఈ సీజన్‌లో జరిగే వ్యవసాయ పంటలకు ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లు అనగా మందు పంపులు, ట్రాక్టర్ పనిముట్లు గురించి వివరించారు. అలాగే నీటి పైపుల వివరాల గురించి తెలిపారు. అలాగే ట్రాక్టర్ పనిముట్ల గురించి వివరాలు ఆర్బికే సహాయకులను సంప్రదించండి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

సిద్దయ్య గారి మఠం అభివృద్ధి పనులను పరిశీలించిన నాయకులు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని ముడమాల పంచాయతీలో వెలిసి ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి ప్రధమ శిష్యుడు సిద్దయ్య స్వామి వారి ఆలయంలో పరిసర ప్రాంతాలను అభివృద్ధి పనులను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్, ఆదేశాల ప్రకారం దేవస్థానం అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి స్థానిక నాయకులు కలసి అభివృద్ధి పనులను చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. మెయిన్ రోడ్డు ఆర్సి నుండి స్వాముల వారి గుడి వరకు సిసి రోడ్డు, సెంటర్ డివైడర్ విద్యుత్ స్తంభాలు లైటింగ్ సరఫరా ఏర్పాటుచేసి త్వరలో సిద్దేస్వముల వారి ఆరాధన మహోత్సవాలకు భక్తుల సౌకర్యాల కోసం ప్రత్యేకంగా సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దడం జరుగుతుందని అందులో భాగంగానే విద్యుత్ శాఖ అధికారులతో కలిసి జరిగిన పనులపై ఆరా తీశారు. అతి త్వరలో పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ,ఏడి, మండల విద్యుత్ శాఖ, ఏఈ రవిశంకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు సాంబశివరెడ్డి, పూజా శివ యాదవ్, లగసాని గంగరాజు, ఆదిబోయిన రమణ యాదవ్, సుధాకర్ యాదవ్, నాగయ్య యాదవ్, సిద్దయ్య స్వామి మఠం వారు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి క్యాంపు కార్యాలయంలో

వైభవంగా రామ, లక్ష్మణుల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ల జన్మదిన వేడుకలు సందర్భంగా బుధవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ల జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టిడిపి నాయకులు రాహుల్ రెడ్డి, మరియు టిడిపి నాయకులు ప్రజా ప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై మంత్రి జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి మండిపల్లి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, అధికారులు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు

విశాలాంధ్ర - ఖాజీపేట : ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బంగ్లా కూడలిలో గల బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం, కూటమి ప్రభుత్వం రాజకీయ పబ్బం కోసం దళితుల మధ్య చిచ్చు పెడుతుంది అని గున్నంపాటి వెంకటరమణ మండిపడ్డారు. అంతేకాకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి అంటు ప్రజలకిచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు, శాంతి భద్రతల పైన కూటమి ప్రభుత్వం మొదట దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను దృష్టి మళ్లించడానికి ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడుతున్నారని ఎస్సీ వర్గీకరణ బిల్లు దుర్మార్గ చర్య అని దీనికి రాష్ట్ర మాలమహానాడు రామోజీ వర్గం తీవ్రంగా ఖండిస్తూ రానున్న కాలంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తీవ్ర ఉద్యమాలు చేస్తామని రాష్ట్ర మాల మహానాడు గుణంపాటి వెంకటరమణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం ఖాజీపేట మండల అధ్యక్షుడు శిఖామణి, ఓబయ్య, శోభన్, బాబు, రమణ, రాజేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్ బాలురలకు కౌన్సెలింగ్

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రాయచోటి పట్టణం యందు మైనర్ బాలురలకు సిఐ బివి చలపతి ద్విచక్ర వాహనాలపై కౌన్సి లింగ్ ఇవ్వడం జరిగింది. అనవసరంగా తిరుగుతూ ఉండడంతో మైనర్లను ద్విచక్ర వాహనాల తోటి స్టేషన్ కి తీసుకుని వచ్చి వారి యొక్క తల్లిదండ్రులకు తెలియజేసి మైనర్ బాలురులు లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా,ద్విచక్ర వాహనాలు నడపడం నేరమని తెలిపి వారి ద్విచక్ర వాహనాలను ఎం.వి.ఐ కి రాయడ మైనది, కావున తల్లితండ్రులు మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వడంతో వారు కూడా చట్టరీత్యా నేరస్తులని గుర్తించవలసిందిగా తల్లిదండ్రులను కోరడమైనది.

పబ్లిక్ పరీక్షా కేంద్రాలపై ఎస్ఐ ప్రత్యేక నిఘా

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండలంలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలపై ఎస్ఐ గొందిపల్లి నవీన్ బాబు బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రత్యేక నిఘా ఉంచారు.ఏక్కడ ఏలాంటి అవకతవకలు జరగకుండా పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి వ్యూహాత్మకంగా వ్యవహరించారు.సిఐ కె హెమసుందర్ రావు అదేశాల మేరకు ఎస్ఐ అద్వర్యంలో రైటర్ పుష్పరాజ్ పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కొరకు పోలీసులు ఎఎస్ఐ విజయలక్ష్మి,హెడ్ కానిస్టేబుల్ బాబురెడ్డి, సుధాకర్ రాజు, శంకరయ్య, కానిస్టేబుల్స్ తిప్పన వెంకటేశ్వర్లు,బాలాజీ తదితరులను పబ్లిక్ పరీక్షా కేంద్రాల వద్ద విధి నిర్వహణ కొరకు రైటర్ నియమించారు. పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

కులవృత్తుల సమావేశానికి బీసిలు హాజరు కావాలి:ఎంపిడివో

విశాలాంధ్ర-గాలివీడు: గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బీసీ కులాల కులవృత్తులు,చేతి వృత్తులపై జరిగే సమావేశానికి బీసీ కులాల వాళ్ళు హాజరవ్వాలని ఎంపిడిఓ జవహర్ బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం బీసీ కులాల్లో వడ్డెర, రజకులు,నాయీబ్రాహ్మణులు,చేనేత,స్వర్ణ కారులు, మత్స్యకారులు, వడ్రంగి, కల్లు గీత కార్మికులు, కుమ్మరి, మేదర,వాల్మీకి బోయ, కృష్ణబలిజ పూసల,శిల్పి పని,కరెంట్ పని,వివిధ బీసీ కుల వృత్తులు, చేతి వృత్తుల వాళ్ళు ఆదరణ-3 పథకం క్రింద వారికి అవసరమైన ఆధునిక పనిముట్లు కొరకు వారి నుండి సలహాలు,సూచనలు తీసు కోవడం జరుగుతుందన్నారు.కావున బీసీ కులాల నాయకులు, ప్రజలు పాల్గొని ఈకార్యక్రమం జయప్రదం చెయాన్నారు.

అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - ఖాజీపేట: ఖాజీపేట మండల పరిధిలోని బక్కాయపల్లి గ్రామానికి చెందిన యువరైతు పత్తి రామచంద్రారెడ్డి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి నీటి సరఫరా కోసం పొలం దగ్గరికి వెళ్లిన రామచంద్ర రెడ్డి అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు రామచంద్రారెడ్డికి భార్య ముగ్గురు పిల్లలు కాగ ఇద్దరు ఆడపిల్లలు ఒక మగ పిల్లవాడు వీరిలో ఒకరు ఇప్పుడు పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థి కూడా ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా క్రీడ,యువజన శాఖ మంత్రివర్యులు మండిపల్లి. రాంప్రసాద్ రెడ్డి వారి సోదరులు మండిపల్లి.లక్ష్మి ప్రసాద్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా లయన్ మేఘా శ్యామ్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని అలాగే మదనపల్లె రోడ్డుమార్గాన గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి తెలిపారు. అనంతరం దాత లయన్ మేఘా శ్యామ్ మాట్లాడుతూ మండిపల్లి సోదరులు పుట్టినరోజు సందర్బంగా నా వంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈరోజు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు మరియు మదనపల్లి రోడ్డు మార్గాన గుడిసెలలొ నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.ఎం.టి కో ఆర్డినేటర్ లయన్ పి.ఎస్.హరినాథ్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర,లయన్ మనోహర్ రాజు,డాక్టర్ కొటేశ్వరి,వినోద్ కుమార్ నాయక్,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి అవగాహన

విశాలాంధ్ర-యర్ర గుంట్ల : మండలం లోని బి.సి కులముల కులవృత్తులు /చేతి వృత్తులకు చెందిన సంఘాల నాయకులకు ఆదరణ -3 పథకము క్రింద వారి వృత్తికి అవసరమైన ఆధునిక పనిముట్ల కొరకు సలహాలు సూచనలకు సంబంధించిన సమావేశం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని గ్రామ పంచాయతీల నుండి నాయీబ్రాహ్మణులు, రజకులు, వడ్డెర, మత్స్య కారుల వారు , చేనేత వారు, స్వర్ణకారులు, వడ్రంగి పని చేసే వారు పాల వ్యాపారం వారు, కల్లు గీత కార్మికులు, కుమ్మరి, మేదర, వాల్మీకి, బోయ, కృష్ణ బలిజ, పూసల, సగర ఉప్పర, శిల్పి పని చేసేవారు, కరెంటు పని చేసే వారు, ప్లంబింగ్ పని చేసేవారు మొదలగు బి.సి కులానికి చెందిన వారు హాజరై వారి వృత్తికి సంబంధించిన పరికరాల గురించి తెలిపారు. ఈ సమావేశంలో విస్తరణ అధికారి, సచివాలయ సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

రెండవ రోజు ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు రెండవ రోజు రెండు సెంటర్లలో ప్రశాంతంగా జరిగాయి సుండుపల్లి పరీక్షా కేంద్రంలో ఒకరు జీకే రాచపల్లి పరీక్ష కేంద్రంలో ఒకరు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ తెలిపారు జీకే రాచపల్లిలో 260 మందికి గాను ఒకరు గైరహాజరై 259 మంది పరీక్షలు రాశారని సుండుపల్లి సెంటర్లో 250మందికి గాను ఒకరు గైర్హాజరై 249 మంది పరీక్షలు రాశారని అధికారులు తెలియజేశారు.స్క్వాడ్ అధికారుల తనిఖీలతో కట్టుదిట్టంగా పరీక్షలు జరిగినట్లు తెలిపారు. సుండుపల్లి పరీక్షల చీఫ్‌గా జయన్న జీకే రాచపల్లె చీఫ్‌గా ఓబులేసులు, డిపార్ట్మెంట్ అధికారులుగా విజయకుమార్ నాయక్,సత్య కుమార్ పకడ్బందీగా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పహారాతో 144 సెక్షన్ అమలు చేసినట్లు అధికారులు తెలిపారు.

మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి

ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర రైల్వేకోడూరు : వేసవిలో ప్రజలు మంచినీటిని వృధా చేయ కుండా పొదుపుగా వాడు కోవాలని కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి కోరారు.చిట్వేల్ మండలం మైలపల్లి పంచాయితీ కేంద్రంలోని ఓసురమ్మ తల్లి ఆలయం వద్ద దాత కొండల రామచంద్రయ్య అధ్వర్యంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ ను వరలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మంచి నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.మంచి నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ తమ భాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మా కుటుంబం ప్రజల అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం వరలక్ష్మి భక్తిశ్రద్ధలతో చెన్నకేశవ స్వామి వారిని, ఓసురమ్మ తల్లిని దర్శించు కున్నారు. మైలపల్లి గ్రామస్తులకు తోడు నీడగా అన్ని విధాలా సహయ సహకారాలు అందించి అభివృద్ధికి కృషి చేస్తున్న వరలక్ష్మి ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల మల్లిఖార్జున రెడ్డి,రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు,పిఎస్ వేణు, స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని ఏపీ ట్రాన్స్కో ఏ.డి రాజగోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు అవగాహన లోపం వల్ల అర్హులైన నిరుపేద ఎస్సీ ఎస్టీ కులాలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజశేఖర్, ఓబన్న, బాలస్వామి, రవి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు, కరువు ఇద్దరూ కవల పిల్లలు

వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : చంద్రబాబు, కరువు ఇద్దరూ కవల పిల్లలు అని వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కరువు ఇద్దరు కవల పిల్లలని పంటలు కరువు వల్ల తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. అనకాపల్లిలో చెరుకు రైతు పంటను కాల్చేసుకున్నాడన్నారు. నేను విజనరీ అని చెప్పుకోవడం తప్ప ఆయనకు విజన్ లేదన్నారు. మన రాష్ట్రంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారని తెలిపారు. అన్నదాత సుఖీభవ అన్నాడు తప్ప...ఒక ఏడాది గడిచినా రైతుకు 20వేలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర లేదు...విత్తనాల సరఫరా లేదు. పంట ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా రైతులను గాలికి వదిలేశారన్నారు. ఇలాంటి అబద్దాలతో అధికారంలోకి వచ్చి మోసం చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేదన్నారు. అవకాశం వస్తే ప్రజలు బుద్ధి చెబుతగతంలో చంద్రబాబు పెట్టిన బీమా బకాయిలను జగన్ చెల్లించారని తెలిపారు. ఇప్పుడు మామిడి పూత రాలిపోతోంది. వాళ్ళను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్నీ వర్గాలు ఈ 11నెలల పరిపాలనను నిశితంగా పరిశీలిస్తున్నారని అవకాశం వస్తే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బడ్జెట్లో రైతులకు కేటాయింపులే అరకొర అయితే ఖర్చు చేసేది ఎంతో కూడా అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బాలయ్య, నాగేంద్రా రెడ్డి, సమ్ముటూరు ప్రసాద్ రెడ్డి, బిహెచ్ ఇలియాస్, గుంటి నాగేంద్రా,మునిశేఖర్ రెడ్డి, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి గంగమ్మ జాతర

విశాలాంధ్ర - సుండుపల్లి : మండల కేంద్రానికి సమీపంలోని బండకాడ ఈడిగపల్లి వద్ద వెలసి ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో నేటి నుండి గంగమ్మ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బీజ నగిరి ఈశ్వరయ్య కార్యకర్త రాంబాబులు తెలిపారు. 21వ తేదీ శుక్రవారం ఉదయం 7:30 గంటల నుండి అమ్మవారికి అభిషేక కార్యక్రమం నిర్వహిస్తారని రాత్రికి జాగారం ఉంటుందని ఆసాధిచే ఆశాధికత కాలక్షేపంతో పాటు అమ్మవారి గ్రామోత్సవం (ఊరేగింపు) గ్రామంలోఅంగరంగ వైభవంగా నిర్వహిస్తారని శనివారం ఉదయం పుట్ట బంగారు తెచ్చి పూజలు చేయడంతో పాటు అమ్మవారికి 101పళ్లెంలో ప్రసాదాలు పెట్టి పూజించడం జరుగుతుందన్నారు.రాత్రికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణచే మేళ తాళాలు బాణా సంచాలతో దప్పు వాయిద్యాల మధ్య చెక్కభజనలతో కోలాటాల మధ్య చాందిని బండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షణ ఉంటుందని అలాగే తిరునాళ్లో గువ్వలచెరువు రవితేజ బృందంచే చెక్కభజన ఆర్కెస్ట్రా కార్యక్రమం ఉంటుందని కావున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : మద్దిరేవుల గ్రామ సచివాలయం దగ్గర బుధవారం సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ ఆధ్వర్యంలో వేసవికాలం దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేశారు. మద్దిరేవుల ఈడిగపల్లి చుట్టు ప్రక్కల సుమారు 10 కిలోమీటర్ల దూరం పైగా మజరా బూడిదగుంటపల్లి, కాకులవరం గ్రామాల ప్రజలు సుదూర ప్రాంతం నుండి అనేక అవసరాల రీత్యా సచివాలయంకు వస్తుంటారని ప్రస్తుతం వేసవి కాలం కావడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నదని మజ్జిగ, త్రాగునీరు అవసర నిమిత్తం ప్రజలు త్రాగాలని, వేసవి ముగిసేవరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రజనీష్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది లావణ్య, నందిని, విజయ కుమారి, సెక్రటరీలు వేణు గోపాల్, శిరిబాబు, అడ్వకేట్ వంశీ కృష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి శాశ్వత కళ్యాణ

ఉభయ దారులకు ఆహ్వానం

మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞాన రచనలతో జనులను జాగృతి పరచిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నందు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి శాశ్వత కళ్యాణ ఉభయ దాతలకు ఆహ్వానం పలుకుతున్నట్లు మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. మాత గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల మాస కళ్యాణ మహోత్సవమునకు ప్రతినెల శుద్ధ ద్వాదశి రోజున నిర్వహించినట్లు వారు తెలిపారు.ఈ కళ్యాణ మహోత్సవంలో శాశ్వత చందాదారులకు 1,00,116 రూపాయలు నిర్ణయించడం జరిగిందని అన్నారు.భక్తులు శాశ్వత ఉభయ దాతలు చేరుటకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పేరుమీద డిడి చెల్లించి శాశ్వత ఉభయ దాతలుగా చేరి స్వామి కృపకు పాత్రులు కాగలరని నేరుగా గాని మఠం సిబ్బంది ద్వారా చెల్లించి రసీదు పొందగలరు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 19129 00 1646 ఐఎఫ్‌సి కోడ్ ఏపీజీబీ 0002033, స్టేట్ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 30830543596 ఐఎఫ్సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0012672, యూనియన్ బ్యాంక్ అకౌంట్ 286110100004137 ఐఎఫ్సి కోడ్ యుబిఐఎన్ 0828611 భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ,మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ మృతికి వైస్ ఎంపిపి నివాళులు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : విశ్రాంత ప్రిన్సిపాల్ యర్రజన్ను రామకృష్ణ (84) ఆకస్మికంగా మృతి చెందిన విషయం స్థానిక వైసిపి నాయకుల ద్వారా తెలుసుకున్న వైసిపి నాయకులు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి కార్యకర్తలతో కలిసి హుటాహుటిన న్యూ క్రిష్టానగర్ లోని మృతుని నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఆయన మృతికి సంతాపం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతులు విశ్రాంత ప్రిన్సిపాల్ 30 సంవత్సరాల పాటు కళాశాలలో లెక్చరర్ గాను, ప్రిన్సిపాల్ గాను పనిచేసి పేరు ప్రఖ్యాతులు సంపాదించారని కొనియాడారు.ఆయన సేవలు చిరస్మరణీయం అని అన్నారు.ధ్వజారెడ్డితో పాటు వైసిపి నాయకులు పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్ బాబు, రాఘవరాజుపురం గ్రామపంచాయతీ సర్పంచ్ ఆర్వీ రమణ, వైసిపి నాయకులు మల్లు కృష్ణారెడ్డి, గౌతంరెడ్డి తదితరులు వెళ్లి మృత దేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షులు రామోజీ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ పబ్బం కోసం దళితుల మధ్య చిచ్చు పెడుతుందని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉన్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను దృష్టి మళ్లించడానికి ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపడుతుందని ఎస్సీ వర్గీకరణ బిల్లు దుర్మార్గమైన చర్య అని అన్నారు. దీనిని రాష్ట్ర మాలమహానాడు రామోజీ వర్గం తీవ్రంగా ఖండిస్తూ రానున్న కాలంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు ప్రణవ్ కుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కిరణ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-రాయచోటి: ప్రస్తుత సమాజంలోని ప్రజలందరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ శుభ్రత కలిగిన ఆహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని మల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రఫీకుల్లా అన్నారు. చిన్నమండెం మండలం జల్లావాండ్లపల్లిలో మంగళవారం ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఫీకుల్లా మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రమాదేవి విజయ్ కాంత్ నాయక్, ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ తుమ్మల స్వాతి, ఏఎన్ఎం నాగరాణి, ఓఆర్ డబ్ల్యు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- రామాపురం : రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి 43వ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో బుధవారం తెలుగుదేశం శ్రేణులు అంజనా రెడ్డి డాక్టర్ శ్రీనివాసులు దేరంగుల శ్రీనివాసులుఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద భారీ కేక్ కట్ చేశారు. అలాగే చిట్లూరులో సురేందర్ రెడ్డి దేవదర్శన్ రెడ్డి చెన్న కృష్ణారెడ్డల ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేశారు. నీలకంఠరావుపేటలో ఉపాధికూలీలకు టిడిపి గ్రామ నాయకుడు పెంచల్ రెడ్డి స్వీట్లు పంచిపెట్టాడు బండపల్లి గ్రామంలో భయ్యా రెడ్డి మంత్రి రాంప్రసాద్ రెడ్డి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిల పుట్టినరోజు సందర్భంగాఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు అనంతరం లక్కిరెడ్డిపల్లిలో నిర్వహించే రక్తదాన శిబిరానికి రాముడు యువసేన ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ రెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రదీప్ కుమార్ రెడ్డి రామాంజనేయులు రెడ్డి ఓబులేసురక్తదాన శిబిరంలో పాల్గొని 20 మంది రక్తదానం చేశారు.. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి. భాస్కర్ రెడ్డి రామకృష్ణ గౌడ .చిలేకంపల్లిశివారెడ్డి శివశంకర్ రెడ్డి శివారెడ్డి చంద్రయ్య. శంకర. బాబు పట్టాభి రెడ్డి చెన్నారెడ్డి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కుల సంఘాల సమావేశం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండలములోని ఆదరణ (పనిముట్లకు) సంబంధించి కులసంఘాలకు మరియు కళాకారులకు తె కుల వృత్తులకు పనిముట్లు అందచేయుటకు గాను, 2025 మార్చి 20న ఉదయం 11 గంటలకు "కులసంఘాలు / కళాకారులతో ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయము నందు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఒంటిమిట్ట ఎంపీడీవో పీఎం కుళాయి బాబు ప్రకటనలు తెలిపారు.కావున అవకాశాన్ని ఉపయోగించుకోవలసినదిగా కులవృత్తుల వారికి తెలియజేశారు.

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాష్ట్ర కల్లుగీత కార్మిక శాఖ మాజీడైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం నుండి ఇప్పటి ఆంధ్ర ప్రదేశ్ వరకు రాయలసీమలో మంత్రులుగా పనిచేసిన ప్రతి ఒక్క నాయకుని కంటే అతి సామాన్యమైన వ్యవహార శైలితో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటున్న ఏకైక నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాత్రమే. అన్నా, మీరు నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వ ర్యాలతో, సుఖ సంతోషాలతో, రాజకీయంగా ఉన్నతమైన స్థానంలో ఎప్పటికీ ఉండాలని మనసారా శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నానన్నారు.

మంత్రి జన్మదినం సందర్భంగా టిడిపి నాయకులచే

ప్రేమాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-రామాపురం : రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు డాక్టర్ లక్ష్మీప్రసాద్రెడ్డిల జన్మదినం సందర్భంగా బుధవారం రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని రామాపురం మండలం పంచాయతీ కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం చెందిన ఏనుగుల సుధాకర్. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పండ్లు. బ్రెడ్డు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, నేను కూడా ఏనుగుల సుధాకర్. కొరివి ధనంజయ. బండారు తిమ్మారెడ్డి. ఈశ్వరయ్య. కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి మండిపల్లి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గాలివీడు: రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి,లక్ష్మీప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు కార్యకర్తలు, అభిమానులు,నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అశేష అభిమానుల మధ్య కేకును కట్ చేసి తెలుగు తమ్ముళ్లు ఒకరికొకరు పంచుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి,పూలు కుంట సర్పంచ్ పార్థసారధి రెడ్డి రాజంపేట పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబులు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గాన్ని ఈ ఐదు సంవత్సరాల కాలంలో అన్ని రంగాలలో అభివృద్ధిలోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు రాంప్రసాద్ రెడ్డి అని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను నిరంతరం పరిష్కరిస్తూ ప్రజల హృదయాలలో సోదరులు ఇద్దరు చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. అనంతరం అన్ని గ్రామాలలో మరియు ఉపాధి పనుల దగ్గర కూడా రాముని లక్ష్మణుని పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రభాకర్ నాయుడు, మహమ్మద్ రియాజ్, మహమ్మద్ రఫీ, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, నాగేశ్వరరావు, ధర్మారెడ్డి, ఉదయ్ కుమార్, కాలపల్లి రామ్మోహన్ నాయుడు, వీర రాఘవులు, టోపీవలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల వెట్టి చాకిరి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 15 నెలల బకాయి జీతాలు రాక వెట్టిచాకిరి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులని కూటమి ప్రభుత్వం పెండింగ్ జీతాలిచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వంలో 2023 జూన్ నుండి 24 జూన్ వరకు 12 నెలలు టీడీపీ ప్రభుత్వంలో 3 నెలలు మొత్తం15 నెలలు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా డిఆర్డీ మధుసూదన్ రావుకు విన్నవించుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు రాక మా కుటుంబాల పోషణ, అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారుల దృష్టికి పలు దఫాలుగా మా సమస్యలు విన్నవించినప్పటికి గౌరవ వేతనాలు ఇస్తున్నామని అధైర్య పడవద్దని పదేపదే హామీ ఇస్తూ కాలయాపన చేస్తూ ఇవ్వకుండా మభ్య పెడుతున్నారన్నారు. డిఆర్డీ పెండింగ్ జీతాల విడుదలకు అధికార యంత్రాంగంతో మాట్లాడి పరిష్కారం కొరకు కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్ జీతాల కొరకు దశల వారి ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌కి రితేష్ రెడ్డి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బద్వేలు : భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యోమగామి సునీతా విలియమ్స్ అద్భుతమైన అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసి భూమి పైకి తిరిగివచ్చిన సందర్భంగా టిడిపి బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్ కు వెళ్లారని 8 రోజుల్లో పూర్తవాల్సిన ఈ అంతరిక్ష ప్రయాణం స్టారైనర్ లో సాంకేతిక సమస్యల కారణంగా 9 నెలల పాటు పొడగించబడింది, అయినప్పటికీ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన మహిళా వ్యోమగామిగా సునీతా విలియమ్స్ కొత్త రికార్డు నెలకొల్పారని, ఆమె పేరు అంతరిక్ష పరిశోధనా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, సునీతా విలియమ్స్ వంటి మహనీయులు దేశ యువతకు ముఖ్యంగా మహిళలకు ప్రేరణగా నిలుస్తారని రితేష్ రెడ్డి అన్నారు.

నేడు పశువుల సంత బహిరంగ వేలం

విశాలాంధ్ర- రామాపురం : మండల కేంద్రంలో వారాంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంతతో పాటు బస్టాండ్ గేటు వేలం గురువారం సాయంత్రం 3 గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో బహిరంగ వేలం నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీకార్యదర్శి నాగరాజు ప్రకటనలలో తెలిపారు.

వారపుసంత వేలం పాట

విశాలాంధ్ర-రామసముద్రం: స్థానిక లక్ష్మీ జనార్ధ స్వామి ఆలయం వద్ద బుధవారం రామసముద్రం వారపు సంత వేలంపాట సర్పంచ్ గౌని వారి కవిత అధ్యక్షతన నిర్వహించారు వారపు సంత, దిన సరి మార్కెట్ శ్రీనివాసులు నాలుగు లక్షల ఐదువేలకు బస్టాండ్ కలందర్ 1,96 వేలకు పాట తగ్గించుకున్నారు. ఏడాది పాటు వీరికి మార్కెట్లో వసూలు చేసుకునేందుకు హక్కులుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఇఓ పిఆర్డి ఫుఫూర్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గౌని వారి విజయకుమార్ గౌడ్ పంచాయతీ కార్యదర్శి మునుస్వామి నాయక్ పాల్గొన్నారు

లయన్స్ క్లబ్ ఆఫ్ టౌన్ ఆధ్వర్యంలో పండ్లు అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర- రాయచోటి: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి సోదరులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిల పుట్టినరోజు సందర్భంగా లయన్ మేఘా శ్యామ్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే మదనపల్లె రోడ్డు మార్గాన గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం చేసినట్లు అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి తెలిపారు. అనంతరం దాత లయన్ మేఘా శ్యామ్ మాట్లాడుతూ మండిపల్లి సోదరుల పుట్టినరోజు సందర్భంగా తన వంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, మదనపల్లి రోడ్డు మార్గాన గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కో ఆర్డినేటర్ లయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి, జోన్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర, లయన్ మనోహర్ రాజు, డాక్టర్ కోటేశ్వరి, వినోద్ కుమార్ నాయక్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-చెన్నూరు : కులవృత్తుల వారు, కళాకారులు ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులవృత్తులు చేసుకునేవారికి కళాకారులకు పనిముట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక సభా భవనంలో కులవృత్తులు చేసుకునేవారికి కళాకారులకు సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని, తద్వారా అర్హులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కావున అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు వారాంతపు సంత వేలం పాట

విశాలాంధ్ర-గాలివీడు: మండల కేంద్రంలోని కూరగాయల సంత,పశువుల సంత,బస్టాండు రుసుములు వేలంపాట 2025-26 సంవత్సరానికి సంభందించి ఈనెల 21 వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు డీపీఎల్వో,ఈవోపీఆర్డీ వారి ఆధ్వర్యంలో గాలివీడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.ఆంజనేయులు నాయక్,సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేలంపాటలో పాల్గొనదలచిన వారు పశువుల సంతకు రూ.2 లక్షలు, కూరగాయల సంతకు రూ.1.50 లక్షలు,బస్టాండ్ రూ.1 లక్ష ధరావత్తు చెల్లించి పాల్గొనా లన్నారు. అంతేగాక పాటదారు తాసీల్దార్ ద్వారా రూ.3 లక్షల ఆస్తి ధృవీకరణ పత్రం వేలంపాట సమయంలో సమర్పించాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనైనా సవాలు ఖాయ పరచుటకు గానీ,రద్దు పరచుటకు గానీ ,వాయిదా వేయుటకు గానీ గ్రామ పంచాయతీ వారికి పూర్తి అధికారం వుంటుందని వారు స్పష్టం చేశారు.

దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని వీరానాయణ స్వామి ఆశ్రమంలో బుధవారం ఆశ్రమవాసులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్వర్గీయ రాణాప్రతాప్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వసుందరమ్మ, కుమార్తెలు చరిత, తేజస్వేత, మనుమల్లు, మనుమరాలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాణాప్రతాప్‌రెడ్డి సోదరుడు సుధాకర్ రెడ్డి ,విశ్రాంత తహశీల్దార్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెచ్చిపోతున్న ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాను అరికట్టాలి

గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వారే ప్రస్తుత ప్రభుత్వంలో కూడా బంధువులయ్యారు
దోపిడీలో వైసిపి, టిడిపి దొందూ దొందే -గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి ఆరోపణ

విశాలాంధ్ర-కడప రూరల్ : గత వైసిపి ప్రభుత్వంలో ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియా విచ్చలవిడి దోపిడి ప్రజల మాన ప్రాణాలకు రక్షణ కొరవడి అభద్రతాభావంతో ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడి వైసీపీని ఘోరంగా ఓడించి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలో కూర్చోబెడితే ప్రభుత్వం మాటున మాఫియా రెచ్చిపోయి అక్రమాలకు పాల్పడుతోందన్నారు. వైసిపి టిడిపి దొందూ దొందే అన్న చందంగా దోపిడీ సాగిస్తున్నారని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సమూలంగా మార్పులు చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అందుకు భిన్నంగా నడుస్తోందన్నారు. విలువైన ప్రభుత్వ వంకా, వాగు, చెరువు, రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈ నామ్, వక్ఫ్, అటవీ, స్మశాన భూముల ఆక్రమణ యదేచ్చగా సాగుతుందన్నారు. మద్యం షాపుల టెండర్లలో ఎవరికి వచ్చినా ప్రభుత్వానికి చెల్లించే పైకంతోపాటు ఎమ్మెల్యేల వాటా చెల్లించాలని, చెల్లించని యెడల షాపులు స్వాధీనం చేసి వదిలి వెళ్ళిపోవాలని ఆ విధంగా చేయని వారిపై అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరింపులతోపాటు ప్రభుత్వానికి చెల్లించే పన్ను ఆదాయానికి మించి చెల్లించాల్సి వస్తుందన్న కారణంతో బెల్టు షాపులకు ద్వారాలు తెరుస్తున్నారని 24 గంటలు మద్యం అందుబాటులోకి అతి సమీపంలోకి చేరవేసి ప్రజల మానప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, ఎన్.వెంకట శివ, ఎంవి సుబ్బారెడ్డి, జి. వేణుగోపాల్, కే.సిబాదుల్లా, సుబ్రమణ్యం, గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో బుధవారం విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కొండలరావు పుట్టిన రోజులు పురస్కరించుకొని పెన్నులు, గణితశాస్త్ర పరికరాలు (కంబాక్సు) తదితర సామాగ్రిని అందజేశారు. విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించిన కొండలరావును మండల విద్యాశాఖ అధికారులు1,2 శ్రీనివాస రెడ్డి, రామ కృష్ణయ్య, జయవర్ధన్‌లు అభినందించారు.

తహసీల్దార్ దృష్టికి ప్రజా సమస్యలు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో వివిధ ప్రాంతాలల్లో నెలకొన్న సమస్యలను పులివెందుల కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డిలు తహశీల్దార్ నజీర్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పులివెందులలోని ప్రజా సమస్యలను తహశీల్దార్‌కు వివరించారు. ప్రజా సమస్యలను వచ్చిన వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. తమ వద్దకు వచ్చిన పలు సమస్యలను గురించి తహశీల్దార్‌కు వివరించారు. అనంతరం తహశీల్దార్‌ను సత్కరించారు వారు మాట్లాడుతూ పులివెందుల మండలంలో ప్రజా సమస్యలు, రెవిన్యూ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం కోసం తహశీల్దార్‌ను కలిశామన్నారు.ఇందుకు తహశీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు.

ఆర్టీసీ బస్టాండును ప్రారంభించాలి: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండు ను ప్రారంభించాలని మాజీ రాజ్య సభ సభ్యులు తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ వేంపల్లి మేజర్ గ్రామ పంచాయతీ లో దాదాపు 40 వేల జనాభా వుంటుందని,ఇది వేంపల్లి,చక్రాయ పేట,వేముల, వీరపనాయనపల్లి, పెండ్లిమర్రి మండలాల కూడలి కేంద్రం అన్నారు. నిత్యము ప్రయాణీకులతో కిట కిటలాడుతుందన్నారు. గతం లో ఉన్న పాత బస్టాండు ను ప్రభుత్వం కూల్చి వేసి దాని స్థానం లో 2కోట్ల 30 లక్షల రూపాయల తో కొత్త బస్టాండ్ ను నిర్మించారన్నారు. బస్టాండు నిర్మాణం పూర్తి అయి కూడా 5 నెలలు అయింది.కానీ ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రయాణికులు ముఖ్యంగా మహిళలూ, వృద్దులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాగే ఉంటే కొద్ది రోజులకు బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంటుంది.కాబట్టి ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వేంపల్లి నూతన ఆర్టీసీ బస్టాండ్ ను ప్రారంభించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, పులివెందుల మండల శాఖ అధ్యక్షుడు తుమ్మలూరు అనిల్ కుమార్ రెడ్డి, చక్రయపేట మండల శాఖ అధ్యక్షుడు మూలం రెడ్డి రామాంజనేయులు రెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నకేశవ, అమర్ నాథ్ రెడ్డి, రవి, ఉత్తన్న, చందు, సాయి, వినయ్, రాజు ,బద్రి, రమణ తదితరులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట ఇన్చార్జ్ ఎంపీడీవోగా కులాయిబాబు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట: ఒంటిమిట్ట ఇంచార్జ్ ఎంపీడీవో గా పీఎం కులాయి బాబును నియమిస్తూ జెడ్పి సీఈవో ఓబులమ్మ ఆదేశాలు జారీ చేశారు ఈ మేరకు బుధవారం ఒంటిమిట్ట ఇంచార్జ్ ఎంపిడిఓ కేఆర్ ఎం ప్రసాద్ నుంచి ఆయనబాధ్యతలు స్వీకరించారు సీకే దిన్నె ఎంపీడీవో గా ఎంపీడీవో గా పని చేస్తున్న పీఎం కులాయి బాబు ఇక్కడికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించండి: కమిషనర్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నగర పంచాయతీ ప్రజలు ఈ నెల 31వ తేదీ లోగా ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను మరియు పాత బకాయి పన్నులు అన్ని చెల్లించాలని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానకు సంబంధించిన పన్నులు చెల్లించాలని తెలిపారు. పన్నులు చెల్లించని ఎడల వారికి సంబంధించిన నీటి కుళాయి కనెక్షన్లు తొలగించి మరియు వ్యాపార లైసెన్సులను రద్దు పరుస్తామన్నారు. అలాగే పన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసి కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెలవు దినాలలో కూడా నగర పంచాయతీ కార్యాలయము నందు పన్నులు చెల్లించుట కొరకు ప్రత్యేకంగా కౌంటర్లు తెరచబడి ఉన్నాయన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-గవర్నెన్స్ అనగా మొబైల్ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ వాట్స్ యాప్ నంబర్: 9552300009 ద్వారా కూడా ప్రజలు ఇంటి వద్ద నుండే పన్నులు చెల్లించాలన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే మాధవి రెడ్డి పని తీరు ఆదర్శనీయం

టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవి రెడ్డి వర్తమాన పరిస్థితులను ప్రజా సమస్యలను పూసగుచ్చినట్టు అసెంబ్లీలో ప్రస్తావించడం, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్ళి విధానం ప్రశంసనీయ మనీ టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. కడప హెూమియోపతి కళాశాలలో అధ్యాపకుల భర్తీ, పాఠశాల విద్యార్థుల సమస్యలు, టిడ్కో ఇండ్లు, ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ఉచిత డీఎస్సీ కోచింగ్, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలు, విద్యుత్ లైన్స్ అండర్ గ్రౌండ్ వైరింగ్ సిస్టం, మహిళ సాధికారత, వికలాంగుల సమస్యలను మరియు అనేక కడప ప్రజలకు సంబంధించిన విషయాలను సభావేదికగా ప్రస్తావించడం వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనియమని తెలిపారు. కడప ఎమ్మెల్యేగా తమ పని తీరుతో మన కడప పేరు ప్రఖ్యాతులు పెంచుతూ ఆదర్శ ఎమ్మెల్యేగా నిలవడం సంతోషకరమన్నారు.

చేనేత ఏపీ.రాష్ట్ర అధికార ప్రతినిధిగా పోలిశెట్టి సురేంద్ర

విశాలాంధ్ర- పీలేరు : చేనేత ఏపీ.రాష్ట్ర అధికార ప్రతినిధి గా పీలేరు కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పోలిశెట్టి సురేంద్ర ను నియమించినట్లు జాతీయ చేనేత ఐక్య వేదిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సుంకర చిన్న రెడ్డి బాబు ఉత్తర్వులు జారిచేసారు. ఈ సందర్భంగా పోలిశెట్టి సురేంద్ర మాటలాడుతూ జాతీయ చేనేత ఐక్య వేదిక ద్వారా చేనేత కార్మికుల పరిరక్షణ కోసం వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

శాసనసభ, శాసనమండలి, సభ్యుల

క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరద

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో శాసనసభ, శాసనమండలి సభ్యులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలలో రెండవ రోజు శాసనసభ, శాసనమండలి సభ్యులతో కలిసి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆటలను ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి షాట్ ఫుట్‌బాల్ ఆటను ఆడారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి, శాసనసభ సభ్యులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులను ఉగాదినాడు ప్రారంభించాలి:కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటి: పూర్తయిన పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలని, ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల వారికి పిల్ల నిర్మాణానికి ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయం లబ్ధిదారులకు అందిలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ కాల్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, అన్ని మండలాల తాసిల్దారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ సిబ్బంది, వీఆర్వోలు, సర్వే సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది తదితరులతో పిజిఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలు, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలు, రీ సర్వే, ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్, పల్లె పండుగ కార్యక్రమాలు, ఎన్టీఆర్ హౌసింగ్, పి 4 సర్వే, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పూర్తి అయిన పల్లె పండుగ పనుల ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని, వారిని ఆహ్వానించి ఉగాది రోజున ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తాసిల్దారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిఎంసికె-జూడా కొత్త కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-కడప :ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ల సంఘం (జిఎంసికె-జూడ) కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన సభ్యులందరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ మరియు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. విజయభాస్కర్ రెడ్డిలను కలిసి, కొత్తగా ఎన్నికైన పదవులకు వారిని అభినందించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఎస్. విష్ణు వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ బి. విజయ్, డాక్టర్ చరిత, డాక్టర్ పూజ, డాక్టర్ ప్రతిభ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. నిఖిల్ సింగ్, డాక్టర్ సుబ్బారెడ్డి కళాశాలలోని సమస్యల గురించి వినతిపత్రం సమర్పించారు. వారు కళాశాల సమస్యల గురించి ప్రస్తావించారు. ప్రిన్సిపాల్ మేడమ్ సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసి జూడా అసోసియేషన్ సభ్యులకు తెలియజేస్తామని చెప్పారు.

పులివెందులలో వైసీపీకి బిగ్ షాక్

18 కుటుంబాలు టిడిపిలో చేరిక

విశాలాంధ్ర - పులివెందుల: పులివెందుల మున్సిపాలిటీలోని రాజారెడ్డి కాలనికి సంబంధించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 18 కుటుంబాలు బుధవారం స్థానిక టీడీపీ నాయకులు తూగుట్ల మధుసూదన్ రెడ్డి, షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) సమక్షంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. టీడీపీ కుటమితోనే భవిష్యత్ సాధ్యమని పార్టీలో చేరిన వారు తెలపడం జరిగింది. పార్టీలో చేరికల అనంతరం బిటెక్ రవి గారు మాట్లాడుతూ మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. సమస్య లను పరిష్కారిస్తామన్నారు., ఇది ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుంది, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని పార్టీలో చేరిన వారికి బిటెక్ రవి హామీనిచ్చారు. అలాగే చేరిన వారు కూడా మధుసూదన్ రెడ్డి షేక్ మహబూబ్ బాషా వారి అండదండలు, బీటెక్ రవి ఆశీస్సులు మాపై ఎల్లప్పుడూ ఉంటుందని ఆశిస్తున్నామన్నారు.

వైవియూ దూరవిద్య కోర్సుల ప్రవేశానికి

దరఖాస్తుల స్వీకరణ

దూర విద్యా సంచాలకులు ఆచార్య కృష్ణారెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ తో కలిసి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయం గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎం కామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంఏ ఎకనామిక్స్ లో ప్రవేశాలు ఉంటాయని అలానే బీకాం, బి బిఏ, బిబిఎం డిగ్రీ చేసిన వారు మాత్రమే ఎంకామ్ లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్ మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్, సమాన అర్హత గల వారు ప్రవేశానికి అర్హులన్నారు. అలానే సర్టిఫికెట్ అండ్ డిప్లమా కోర్సులలో సైకాలజీ- కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్, లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్, ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ అండ్ మిషన్ లర్నింగ్, బిగ్ డేటాఅనాలసిస్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అని తెలిపారు. ఈ కోర్సులన్నీ డిస్టెన్స్ , ఆన్లైన్ లర్నింగ్ విధానంలో ఉంటాయన్నారు.

ఈవోపీఆర్డీ మల్లికార్జునరెడ్డి బదిలీ

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి చక్రాయపేట మండలానికి బదిలీ అయ్యారు. గతంలో వేంపల్లిలో ఈవో పీఆర్డీగా పనిచేసిన మల్లికార్జునరెడ్డి అవినీతి ఆరోపణలు ఎదుర్కొవడంతో ఆ మేరకు విచారించిన జిల్లా కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో వేంపల్లెలో ఈయన పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొనగా అధి కారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో వేంపల్లె ఈవోపీఆర్డీ మల్లికార్జునరెడ్డిపై బదిలీ వేటు పడినట్లు తాజా సమాచారం.